# ఆర్గ్యుమెంటు

'యీమయ్యా జడ్జీగారూ నాకు శిక్షవేసేముందు నేను చెప్పే సంగతులు యోచించుకోండి! నాకుమల్లేనే మీకూ నవరుచులున్నాయి; నా మాదిరిదే మీశరీరమూ. రక్తమూ, మాంసమే-ఇనుముకాదు. నాలోనూ అందరిలోనూ వున్న ఆత్మే మీలోనూ ప్రకాశిస్తోంది. ఎంత రాయి చేసుకున్నా హృదయం మీలోనూ కొట్టుకుంటోంది. దోషాన్ని తూచి శిక్షలు తయారుచేసి నా మొహాన పారేసే మెషినుకాదు కదా! మీరు వినండి నేను చెప్పేదంతా. విని, న్యాయమని తోస్తే విడిచిపెట్టండి. వొదిలి పెట్టటానికి స్వతంత్రం లేదా? యీ ఉద్యోగం మానుకోండి ధైర్యం వుంటే. ధైర్యం లేక నిర్దోషిని శిక్షిస్తారా? కానీండి.

నేను నిర్దోషిని. దోషినని నాతో వాదించి రుజువుచెయ్యి. ఆ ప్లీడరుని వూరుకోమను. వాళ్ళకి నిజంతో పనిలేదు, ఫీజుతో తప్ప. నా నేరం నేనే ఒప్పుకుంటున్నాను. సాక్షులతో పనిలేదు; నీకు మెదడు వుంది. నాకూ వుంది ఇద్దరం కలిసి యోచిద్దాము.

అవును, బిడ్డ పుట్టకుండా నేను గర్భం తీసేసుకున్నాను. అదెట్లా నేరమో చెప్పు?

పుస్తకాల్లో తప్పని రాసివుంది; అలా తప్పనకు. పుస్తకాలు పురాతనాలు. ఆ రాసిన వాళ్ళు దుర్మార్గులు. బుద్ధిహీనులు. వాళ్ళమాట ప్రకారమే నడుచుకుంటే, మనకి వేరే మెదళ్ళెందుకు. తెలివెందుకు? పుస్తకంలో అక్షరాలకి లొంగిపోతావా? నేను తిరగబడ్డాను. లోపడ్డావా. నువ్వు, నాకంటె పిరికివాడివి-స్వతంత్ర యోచనలేని వాడివి - దోషివి - నీకేం అర్హత వుంటుంది నన్ను శిక్షించడానికి?

వినుమరి-నేను మొదట చేసింది తప్పంటావా? ఆ పనిచేస్తే శిక్షలేదు, మీ పుస్తకాల ప్రకారమే. ఆ పనే తప్పంటావా? అది నువ్వుచేస్తున్నపనే. భర్తలేనిది చెయ్యడం తప్పంటావా? భర్తవుండి కడుపు వచ్చినా, కడుపు తీసుకోడం నేరమేగా? అదిగాక కడుపురాకుండా ఏం చేసినా తప్పు లేదూ? వొస్తే మొదటినించీ అంతా తప్పా! కడుపురావడం నా తప్పుకాదు కద! పెళ్ళానికి పిల్లలు పుట్టకపోతే అది ఆమె తప్పుగా చూసే మీరు, నాకు కడుపురావడం తప్పంటారా? గర్భం కలిగిం తరవాత యెందుకు తీసేసుకున్నావంటారు? నాకు అనేక కారణాలున్నాయి. నన్ను పోషించేవాడు వొదిలేస్తాడు. ఎట్లా బతకను? నాకింకేమీ కష్టంపని చేసుకుని బతకడం చేత కాదు. కూలి చేసుకోరాదా? వంట చేసుకోరాదా అని సులభంగా అంటారు. అందమైన కూలిదాన్నిగాని, వంటదాన్నిగాని బతకనిస్తారా మొగాళ్ళు? ఇక్కడ వున్న వాళ్ళందరూ అట్టాంటి మహానుభావులే. కోట్లూ, తలగుడ్డలూ పెట్టుకుని వెకిలి నవ్వులు కార్చుకుంటో, మీసాలు మెలేస్తో నావంక అతితీవ్రంగా చూస్తో కూచుంటే సరా? మీ సంగతి ఎవరికి తెలీదు? మొగాళ్ళు బలవంతం చేస్తే నీ నీతి ఏమయిందంటావు? తమకి లోబడకపోతే తమ పెళ్ళాలతో సాడీలు చెప్పి పనిలోంచి తీసేయిస్తారు. ముందు మొగుళ్ళ

మీదనే సాడీలు చెప్పితే మొగుళ్ళతో పోట్టాడినా, చివరికి ఆడవాళ్ళూ నన్నేపొమ్మంటారు మర్యాదగా! నేనూ బతకాలి, ఎందుకు లోబడ్డానని అందరూ తిట్టేవాళ్లే! మీ భార్యల్ని అట్లా గదుల్లో దాచుకోకుండా, కానీ లేకండా, నాకు మల్లే, వీధుల్లో పారెయ్యండి. వితంతువులుకాగానే ఏ బంధువుల ఇళ్ళల్లోనో చాకిరీలకి చేర్తారే? అభిమానమున్నదాన్ని గనక ఆ నీచత్వంకన్న ఈ స్వతంత్రమే నయమనుకున్నాను. స్వతంత్రంగా సంపాదించమనండి. ఓ దమ్మిడి మీ భార్యల్ని, తెలుస్తుంది. ఆ కులుకు, ఆ పాతివ్రత్యం అన్నీ యామవుతాయో! రెండు రోజులు యింట్లోంచి వెళ్ళి బైటబతికి రమ్మందురూ తెలుస్తుంది సంగతి!

ఆ సంగతి పోనీండి. గర్భంరాగానే ఆయన నన్ను వదిలేశాడు. ఆకలెక్కువయింది. ఒంట్లో బాగాలేదు. మందులు కావాలి. ఏం చెయ్యను? మీ గుమ్మాల్లోకి వస్తే తరుముతారు. అవునా? పతివ్రతలు మీ భార్యలు, గుమ్మాలు కడుక్కుంటారు. మైలపడ్డామని నానీడ తాకినచోట పాణ్ణీలుచల్లి శుద్ధిచేస్తారు.

బిడ్డని కంటాననుకోండి. దాన్ని నువ్వు పెంచుతావయ్యా? పోనీ దాని పోషణకి కర్చు యిస్తావా? శరణాలయాలున్నాయి, కాని నీతియుక్తంగా కన్న పిల్లలని తల్లిదండ్రులు చస్తే తీసుకుంటారట ఆ శరణాలయాలు. పెట్టినవాళ్ళు నీతియుక్తంగా పుట్టారేమో అసలు! వెధవ ముండా కొడుకని అందరూ యేడిపిస్తే ఎవరు ఓదారుస్తారు? నీ పిల్లలతో ఆడుకోనిస్తావా? నన్ను పోషించడమే మా ఆయనకి ఇంత కష్టంగా వుంది. రోజుకి మూడుసార్లు పొమ్మంటారు. నేనైతే మాడి చస్తాను. వాణ్ణి ఎట్టా చంపుకోను? వాడిబాధ చూడలేక వాణ్ణి ఏ బావిలోనో తోసి నేను వురకాలి. పేపర్లో చదువుతారు. ఒక స్త్రీ పిల్లాణ్ణి చంపి తాను చచ్చిందని, దీనికేం పుట్టిందని తిట్టుకుంటారు. పేపరు మడిచి దీపమార్పి పడుకుంటారు.

మరి ఆ 'లా'ని యేర్పరచిన వాళ్ళు, మీరో మీ తాతలో, నాకు వెలిరాకుండా నా బిడ్డకి అమర్యాద రాకుండా కాపాడతారా? ఆ సంగతి మీకేమీ తెలీదు. మీకు తెలిసిదల్లా నన్ను కైదులో పారెయ్యడమే.

అవును నాకు వేరు గతిలేక ఆ దిక్కుమాలిన పిల్లకి ప్రాణమిచ్చి ఏడిపించడానికి కాఠిన్యం తక్కువై, తల్లిని గనక యీ పని చేశాను. మీ అభ్యంతరమేమిటి?

మొదటిది-ప్రాణం తీశానన్నారు. అది నాలో భాగమా వేరే ప్రాణమా? నాలోభాగం అయితే దాన్ని తీసేసుకుంటే మీకేం? నాకో కురుపులేస్తే కోసేసుకోనూ? నా చెయ్యి కోసేసుకుంటా మీకేం? వేరే ప్రాణమా? నాది కాదా? అయితే నా లోపల దాన్నెవరు ప్రవేశించమన్నారు. నా అనుజ్ఞలేంది? లోపల ప్రవేశించినన్ను బాధించమన్నదెవరు? మీ అనుజ్ఞలేకుండా మీ యింటోకి ఎవరన్నావస్తే మీరేం చేస్తారు? అట్లానే నేనూ బైటికి తరిమేశాను. చస్తే నేనేం చెయ్యను? నేను రప్పించానా? లేదు. నాకు బిడ్డ పుట్టాలని యే మాత్రమూ లేదు. నాలోకి వచ్చి నా ఆరోగ్యం, నా సౌందర్యం చెడగొట్టి, నా మానం తీసేస్తే

బాగానే వుందీ? నేనెందుకు దాన్ని కాపాడాలి? దాని కోసమా? అవును మీ కోసములాగే వుంది. మీరందరూ దాన్నితిట్టి వెక్కిరించి మీ పతివ్రతల్ని మీ పిల్లల పవిత్రపు పుటకల్నీ సమర్థించుకునేందుకు.

నా యిష్టం వచ్చిన మందు నేను మింగుతాను. దాన్ని చావమన్నదెవరు? మీ పొట్టలో పాములు చేర్తే అవి చావడానికి బాగానే మందులు తాగుతారే?

దాని కసలు ప్రాణమున్నదని మీకెట్లా తెలుసును? భూమిమీద పడంది వూపిరన్నా పీలవదు. ప్రాణమున్నదని నీకేం తెలుసు? నువ్వెప్పుడన్నా కడుపుతో వున్నావా? జడ్జీ నీకేం తెలుసు? పుట్టిన బిడ్డ తిండిలేక మాడి చస్తే నీ ప్రాణం సుఖంగా వుంటుందా? నీ కళ్ళు చల్లగావుంటాయా? మరి ప్రాణం తీసిన వాళ్ళకి మరణశిక్ష కదా ! అది వెయ్యరేం నాకు ? అంటే పూర్తి మరో ప్రాణం కాదన్నమాట. అరప్రాణం. పావు ప్రాణం వుంటుందా? అరఆత్మ పావు ఆత్మ వుంటాయా? నిండు ఆత్మలు మీకున్నాయా? వుంటే నన్నెందుకిట్లా యేడిపిస్తారు? మిమ్మల్ని చంపినా తప్పులేదు అయితే!

కోడి గుడ్డుకి ఎన్నోవంతు ప్రాణం. గొర్రెకి వాటికి ఆత్మ వుందా లేదా! అట్లా చూస్తావేం? నీకేం తెలుసునని కూచున్నావు నన్ను శిక్షిస్తానంటో.....

నా ఆరోగ్యం చెడిపోతుంటారా? కాఫీ హొటల్లో చెడ తినే వారినీ, పసి భార్యలకోసం మందులు తినే ముసలివాళ్ళనీ దండించరేం? నలభైయేళ్ళకే మూలశంకలూ, అతి మూత్రాలూ తెచ్చుకునే జడ్జీలని దండించరేం? దిక్కుమాలినదాన్ని నేను దొరికానా? నా ఆరోగ్యం పోతే ఎవడికేం? నా ప్రాణంపోతే ఎవడికేం? దుర్మార్గంలోపడి యెట్లా చచ్చిందోనని నన్ను చూసుకు సంతోషంతో కడుపు నింపుకుంటారు మీ భార్యలు.

దీన్ని చంపినందుకు లోకంలో మనుషులు తక్కువవుతా రంటారా మీరందరూ? పుణ్యాత్ములు మీరున్నారు చాలదూ? కనకుండా వున్న ప్రతి ఆడదాన్నీ శిక్షించండి, వితంతువుల్నందర్నీ కనిపించండి బలవంతగా!

మీ జనసంఖ్య పెరగడానికి యింకో జీవాన్ని నన్ను మోయ మనడానికి మీరెవరు? సృష్టి సాగదంటారా? నాకేం? నీకు సృష్టి సాగిస్తానని పూచీకత్తు నిచ్చానా? అసలు నన్ను కనవద్దని సంఘం ఆజ్ఞాపించిందిగా. 'లా' కనమంటోంది. కంటే సంఘం, కనకపోతే 'లా' శిక్షిస్తాయి. మరి సంఘమే 'లా'ని ఏర్పరించింది.

సృష్టి నాలో యింకోజీవాన్ని పెట్టింది. దాన్ని తీసుకునే శక్తిని యిచ్చింది. మధ్య మీ కెందుకు?

ఏమంటావు, నన్ను వొదులుతావా? నీ వుద్యోగం పోతుందని భయమా? నీ వుద్యోగం కోసం నన్ను, నిర్దోషిని, శిక్షిస్తావా? ఇదేనా నీతి, యిదేనా పుణ్యం, చెప్పు జవాబు?

◆ ◆ ◆

*రచనాకాలం - 1922,*

*ప్రచురణ : (చక్కమ్మకథలు) దేశీ ప్రచురణ, 1957 పునర్ముద్రణ*